

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 17.0



రండి..బాబూ రండి!





ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

తాజాగా కాంగ్రెస్ నుంచి ఆహ్వానాలు

సంక్రాంతి పండుగకు ముందే పనిలోకి దిగిన బీజేపీ

నియోజకవర్గాల నుంచి భారీగా దరఖాస్తులు

ఎన్నికల పొత్తు ఉంటుందంటూ ప్రచారమే కారణం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎన్నికల రణంకు అన్ని పార్టీలు కత్తులు నూరుతున్నాయి. ఎత్తుకు పైఎత్తులకు దిగుతున్నాయి. పోటీకి తలపడే ఆశావహుల జాతకాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇంకోవైపు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు తాజాగా పోటీ చేయాలనుకున్న వారి నుంచి దరఖాస్తులు కోరాయి. సంక్రాంతి పండుగకు ముందే బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశావహులు తమ దరఖాస్తులను సంబంధిత నేతలకు అందించారు. ఇప్పుడు కాంగ్రెస్ ఆ తరహా కసరత్తుకు దిగింది. నేటి నుంచి అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేయాలనుకున్న వారంతా ఒక అప్లికేషన్ ఇవ్వండంటూ ఇప్పటికే సూచించింది. వైసీపీ, టీడీపీ, జనసేన ఆశావహుల జాబితాలను సరిచూసుకోవడం, గెలుపు గుర్రాలను బరిలోకి దింపేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లలో మునిగి తేలుతున్నాయి.

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు అన్ని పార్టీల్లోనూ భారీగా పెరుగుతు న్నారు. ఒకవైపు సామాజిక, ఆర్థిక బలం ఉన్న వారే కాకుండా దీర్ఘకాలికంగా ఒకే పార్టీని నమ్ముకుని ఉన్న వారిలో సీనియర్లు సైతం ఈసారి బరిలోకి దిగాలని ఉత్సాహపడుతున్నారు. దీని అనుగుణంగానే తమకు పరిచయం ఉన్న రాష్ట్రస్థాయి నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. ప్రత్యేకించి షర్మిల రాకతో కాస్త కాకెక్కిన కాంగ్రెస్‌లోను ఇదే ఉత్సాహం తొంగి చూస్తోంది. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఎవరైతే ఉత్సాహవంతులు ఉన్నారో వారందరి దరఖాస్తులను బుధవారం నుంచి స్వీకరిస్తున్నారు. రెండు రోజుల క్రితమే జిల్లాలో ముఖ్యులకు ఈ తరహా వర్తమానం అందింది. పీసీసీ రాష్ట్ర కార్యాలయంలోనే దరఖాస్తులు అందించాలని షరతు పెట్టారు. వాస్తవానికి కాంగ్రెస్‌లో పాత తరమంతా ఇప్పటికే పోటీ సిద్ధపడలేనంత వయోభారంలో ఉన్నారు. ఈ మధ్యన కాస్తోకూస్తో రాజకీయ ప్రేరణ ఉన్నవారు మాత్రమే పోటీకి వీలుగా దరఖాస్తులకు సిద్ధమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతామని ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ప్రతీ నియోజకవర్గంలోను అరడజనుకు పైగానే ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహులు పెద్ద సంఖ్యలో పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లతో సంప్రదిస్తున్నారు. తమ అనుభవం, ఆర్థిక బలం, సామాజిక బలం మూడింటిని ప్రస్తావించడమే కాకుండా 2014 తర్వాత ఇప్పటి వరకు కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లో చేరిన వారు అక్కడి నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ టికెట్ పొందేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భీమవరం, ఏలూరు, దెందులూరు, నూజివీడు, తాడేపల్లిగూడెంతో సహా కొన్ని నియోజకవర్గాల నుంచి సీనియర్లు దరఖాస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏలూరు జిల్లాలో గురువారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించబోతున్నారు. ఆ సందర్భంలోనే తమకు తాముగా పరిచయం చేసుకోవడానికి ఇంకొందరు పోటీ పడుతున్నారు. ఇదిలా ఉండగా పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే వారి సంఖ్య మిగతా పార్టీల్లోనే అత్యల్పంగా కనిపిస్తుండగా, కాంగ్రెస్ పక్షాన ఎవరు ముందుకు వస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది. నరసాపురం పార్లమెంటరీ నియోజ కవర్గం నుంచి సుదీర్ఘ కాలం పాటు పోటీ చేసిన కనుమూరి బాపిరాజు ప్రస్తుతానికి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఉన్నారు. పీసీసీ చీఫ్ షర్మిల నేతలతో ముఖాముఖి భేటీకి సిద్ధమవుతున్నారు. సీనియర్లతో పాటు ఉత్సాహవంతులైన నియోజకవర్గ నేతలతో ఆమె సంభాషించబోతున్నారు. తొలుత జిల్లాల వారీగా పర్యటించడం, ఆ తర్వాత ముఖాముఖి భేటీలు, ఎన్నికల చర్చకు తెరలేపబోతున్నారు. నరసాపురం, ఏలూరు కో-ఆర్డినేటర్లు బాపిరాజు, జెట్టి గురునాథరావు ఇప్పటికే పార్టీలో పూర్తి కదలిక తేగలిగారు.

కమలం పార్టీలోనూ కోలాహలం

సంక్రాంతి పండుగకు ముందే నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను భారతీయ జనతా పార్టీ గుట్టుగా అందుకుంది. ప్రత్యేకించి మూడు రోజులపాటు అందరికీ గడువు ఇచ్చి ఆ సమయంలోనే దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ షరతు పెట్టింది. ఎవరైతే పదాధికారులు ఉంటారో వారికే దరఖాస్తుల స్వీకరణకు అధికారం ఇచ్చింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున ప్రతీ నియోజకవర్గం నుంచి దరఖాస్తులు అందడం పార్టీని ఆశ్చర్యంలో ముంచెత్తింది. వాస్తవానికి జనసేన-టీడీపీ ఎన్నికల పొత్తుకు దిగగా ఈ రెండు పార్టీలతోను చివరి క్షణంలో బీజేపీ సయోధ్య కుదుర్చుకునే అవకాశం ఉందని ఆనోటా, ఈనోటా ఇప్పటికే విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రభావం బీజేపీపై పడింది. ఈ కారణంగానే దర ఖాస్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగినట్టు చెబుతున్నారు. ఏలూరు నియోజక వర్గంలో సీనియర్లతో పాటు అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు బీజేపీకి కాస్త ఊపున్న నియోజక వర్గాల్లోనూ ఆశావహులకు కొదువ లేనట్టుగానే కనిపించింది. ఎవరంతట వారు రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేది తామే అన్నట్టుగా అక్కడక్కడ సోషల్ మీడియాలో బాకా ఊదుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజక వర్గ స్థాయిలో ఒకవైపు ఆశావహుల దరఖాస్తులు తీసుకుంటూనే ఇంకోవైపు ముఖ్యనేతలతో కమిటీలు వేస్తున్నారు. ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తుల స్వీకరణ, స్క్రీనింగ్ కోసం జిల్లా కోర్ కమిటీలు త్వరలోనే సమావేశ మవుతాయి. ఈ సమావేశంలోనే బలం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి రాష్ట్ర నాయకత్వానికి నివేదిస్తారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే ఆశావహుల నుంచి అందిన దరఖాస్తులు 70కు పైగా ఉన్నట్టు చెబుతున్నారు. ఎంపీ స్థానానికి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) పోటీ చేయ నుండడం, ఈ మేరకు ఇప్పటికే ఆయన నియోజక వర్గ మంతటా దూసుకుపోతూనే ఉన్నారు. తపనా చౌదరి చొరవతో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీకి కాస్తంత ఊపిరొచ్చింది. స్థానిక అవసరాలకు వీలుగా చౌదరి ఆర్థికపరమైన, అక్కడికక్కడే అవసరం తీరేలా మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేస్తూ వచ్చారు. ఇవన్నీ బీజేపీకి కొంత కలిసొచ్చినట్టు కనిపిస్తోంది.



యువ ఓటర్లదే హవా !

ఏలూరు సిటీ, జనవరి 24 : జిల్లాలో యువ ఓటర్లే అధికంగా వున్నారు. ఈ నెల 22వ తేదీ విడుదల చేసి తుది ఓటర్ల జాబితా ప్రకారం.. జిల్లా జనాభా 21,77,756 మంది. వీరిలో మహిళలు 11,00,125, పురుషులు 10,77,631 మంది. మొత్తం ఓటర్లు 16,24,416 కాగా వీరిలో 8,30,390 మంది మహిళలు, 7,93,897 మంది పురుషులు ఉన్నారు. వయసు ప్రాతిపదికన చూస్తే 30 నుంచి 39 ఏళ్ల వయసు వారే అధికం. జిల్లాలో ఈసారి యువ ఓటర్లు అధికంగానే నమోదు చేసుకున్నారు. గతంతో పోలిస్తే ఈసారి 18 నంచి 19 ఏళ్ల వయస్సు గల కొత్త ఓటర్లు 37 వేల 877 మంది ఉన్నారు. 20 నుంచి 39 ఏళ్ల వయసున్న ఓటర్లు 7,19,071 మంది కావడం విశేషం. యువ ఓటర్లు జిల్లా ఓటర్ల జాబితాలో 50 శాతంపైగానే ఉన్నారు. జిల్లాలో ఏడు నియోజక వర్గాలకు గాను చింతలపూడిలో అత్యధికంగా 2,71,502 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా కైకలూరులో 2,04,348 మంది ఓటర్లు ఉన్నారు.

వయసుల వారీగా

వయసు	ఓటర్ల సంఖ్య
18 నుంచి 19	37,877
20 నుంచి 29	2,83,402
30 నుంచి 39	4,35,669
40 నుంచి 49	3,49,488
50 నుంచి 59	2,63,287
60 నుంచి 69	1,58,796
70 నుంచి 79	72,671
80 పైబడిన..	23,226
మొత్తం	16,24,416

ఐదేళ్లలో పెరిగింది 65 మందే

మహిళా ఓటర్లు నలుగురే

నరసాపురం నియోజకవర్గ ఓటర్ల జాబితా



నరసాపురం, జనవరి 24: నరసాపురం నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా రాజకీయ పార్టీలను ఆశ్చర్యానికి గురిచేసింది. గడిచిన ఐదేళ్ల కాలంలో 65 మంది ఓటర్లు మాత్రమే జాబితాలో పెరిగారు. 2019లో 1,68,122 మంది ఉన్నారు. ప్రస్తుతం ప్రక టించిన జాబితాలో ఈ సంఖ్య 1,68,187కు పెరిగింది. ఇదే 2014 నుంచి 2019 వరకు పరిశీలిస్తే దాదాపు 17,552 పెరిగింది. 2014లో మొత్తం ఓటర్ల సంఖ్య 1,50570 మంది ఉండగా 2019 నాటికి ఆ సంఖ్య 1,68,122కు పెరిగింది. ప్రస్తుతం ప్రకటించిన ఓటర్ల జాబితాలో పురుషులు 83745, స్త్రీలు 84442 మంది ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు పరిశీలిస్తే మహిళ ఓటర్లు కేవలం నలుగురు మాత్రమే పెరిగారు. 2019లో మహిళలు 84,438 మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 84,442కు పెరిగింది. ఆదే పురుషుల్ని పరిశీలిస్తే కేవలం 62కు పెరిగింది. 2019లో పురుషులు 83,683 ఉంటే 2024లో ఆ సంఖ్య 83,742 ఉంది. అయితే 2019లో ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉంటే నేడు ఆ సంఖ్య జీరో అయింది.

	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
2014	74,941	75,621	8	1,50,570
2019	83,683	84,438	1	1,68,122
2024	83,745	84,442	0	1,68,187

నేడు షర్మిల రాక



ఏలూరు కార్పొరేషన్, జనవరి 24 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల గురువారం ఏలూరులో పర్యటించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు బుధవారం తెలిపారు. షర్మిలకు భారీ స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఫ్లయ్ ఓవర్, తంగెళ్ళమూడి మీదుగా ఇండ్రికగూడెం సెంటర్‌లోని సుభీభవ కల్యాణ మండపానికి చేరుకుని జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృత సమావేశం నిర్వహిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిధున్‌రెడ్డి

30న సీఎం జగన్ రాక

ఏలూరులో వైసీపీ ఎన్నికల సన్నాహక సమావేశం : ఎంపీ మిధున్‌రెడ్డి

ఏలూరు రూరల్, జనవరి 24 : 'చంద్రబాబు ట్రాప్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పడింది. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఆమె చదువుతోంది' అని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ పరిశీలకుడు, ఎంపీ మిధున్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 30న ఏలూరులో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో ఎన్నికల సన్నాహక సమావేశం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జగన్‌ను జైలులో పెట్టించి,తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లటం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా మన్నారు. వైసీపీ టిక్కెట్ రానివారికి సహజంగానే అసంతృప్తి ఉంటుందన్నారు. టిక్కెట్లు రాని వారికి జగన్ సముచిత స్థానం ఇస్తారన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్య చౌదరి, పి.వాసుబాబు, మేకా వెంకటప్రతాప్ అప్పారావు, దూలం నాగేశ్వరరావు, తెల్లం బాలరాజు, చింతలపూడి ఇన్‌చార్జ్ కె.విజయరాజు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

మన్యంలో పులి ? 7
ఏసీబీ వలలో రైటర్, ఏఎస్ఐ

ఎన్నికల షెడ్యూల్ వస్తే వైసీపీ ఖాళీ

టీడీపీ జోన్ 2 ఇన్‌చార్జి ప్రత్తిపాటి పుల్లారావు

150 మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు, వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 24: ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే వైసీపీ ఖాళీ అయిపో వడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జోన్-2 ఇన్‌చార్జి ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం సాధించడం తథ్యమన్నారు. పెంటపాడు మండలం పరిమెళ్ల గ్రామం నుంచి తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణ పార్టీ కార్యాలయం వద్ద పుల్లారావు సమక్షంలో టీడీపీలో చేరారు. పుల్లారావు మాట్లాడుతూ వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు చాలామంది ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. రానున్న కాలంలో మరింత మంది టీడీపీలో చేర తారన్నారు. మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ టీడీపీలో చేరేందుకు చాలామంది వైసీపీ నాయకులకు రావాలని ఉన్నా స్థానిక మంత్రి కారణంగా భయపడు తున్నారన్నారు. వైసీపీకి అభ్యర్థులు లేరని, స్థానిక మంత్రికి కూడా టిక్కెట్ వస్తుందో లేదో తెలియద న్నారు. గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు, రాంబాబు, షేక్ బాజీ, కృష్ణ మోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీసీ గణన పేరిట జగన్ కొత్త నాటకం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

భీమవరం, రూరల్, జనవరి 24 : బీసీలకు ఎటువంటి లబ్ధి చేకూర్చలేని సీఎం జగన్ బీసీ జనగణన పేరుతో మరో కొత్త నాటకం తెరపైకి తెచ్చారని వార్డు వలంటీర్లతో బీసీ కులాల వారి వద్దకు వచ్చి వేలిముద్రలు, ఓటీపీలు చెప్పమని బలవంతం చేయడం వెనుక మోసపూరిత కుట్ర దాగి ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్ర ఆరోపించారు. భీమవరం మండలం దొంగపిండిలో మండల టీడీపీ అధ్యక్షుడు రేవు వెంకన్న అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి జరుగుతుందని రానున్న ఎన్నికలలో చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసేలా అన్ని నియోజకవర్గాలలో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతా రామలక్ష్మి మాట్లాడుతూ వచ్చేది టీడీపీ జనసేన ప్రభుత్వమేనని చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాట చేస్తారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేని గౌరునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో జయహో బీసీ సమావేశాల అనంతరం జిల్లా మహాసభ నిర్వహించనున్నామన్నారు. నరసాపురం జనసేన ఇన్‌చార్జి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ త్వరలో ఏర్పడనున్న జనసేన టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు నిజమైన అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందను న్నాయన్నారు. పెదన టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణ మోహన్, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఖజానా కార్యాలయంలో చెక్కుల దహనం

భీమవరం టౌన్, జనవరి 24: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని ఖజానా కార్యాలయాలకు సంబంధించి నిరు పయోగంగా ఉన్న చెక్కు బుక్కులను దహనం చేసినట్టు జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్ తెలిపారు. చాలా కాలంగా నిరుపయోగంగా వున్న వివిధ రకాల చెక్ బుక్కులు దహనం చేయమని ఆదేశాలు చేశారని దీనికోసం జిల్లా జాయింటు కలెక్టరు ఆధ్వర్యంలో పదిమంది జిల్లా స్థాయి అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సూచనల మేరకు బుధ వారం జిల్లాలో ఏడు ఉప ఖజానా కార్యాలయాల్లో ఉన్న 2,044 చెక్ బుక్కులను దహనం చేసినట్టు తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, దేవ దాయ, ధర్మాదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఏటీవోలు అబ్దుల్ హకీమ్, బి.లీల, ఎస్టీవో రవి వర్మ, జిల్లా ఉప ఖజానా అధికార్లు, పాల్గొన్నారు.

ర్యాంప్‌లో ఉన్న వాహనాల తరలింపు

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఆచంట, జనవరి 24: నియోజకవర్గంలోని సిద్ధాంతం, నడిపూడి ర్యాంప్‌లలో ఇసుకను అక్రమంగా తరలించేం దుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఆంధ్ర జ్యోతిలో బుధవారం ప్రచురణ అయిన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై రెవెన్యూ అధికారులు ర్యాంప్ లోకి వెళ్ళి ర్యాంప్‌లలో ఉన్న వాహనాలను బయటకు తీసుకువచ్చారు. అనుమతులు లేకుండా ర్యాంప్‌లలో ఇసు కను తరలిస్తే ఆటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

కొట్టుకు ఛాన్స్ ఉంటుందా ?



తాడేపల్లిగూడెంపై మల్లగుల్లాలు

ప్రత్యామ్నాయంపై దృష్టిపెట్టిన అధిష్ఠానం

ముగ్గురి పేర్లు తెరపైకి

సర్వేలో నిమగ్నమైన బృందాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్నాయి. అభ్యర్థుల విషయంలో ప్రధాన పార్టీలు కుస్తీ పడుతున్నాయి. సర్వే నివేదికలు రాబడు తున్నాయి. తదనుగుణంగా సీట్లు ఖరారు చేసే పనిలో నిమగ్నమవుతున్నాయి. అధికార వైసీపీ ఇప్పటికే జిల్లాలో భీమవరం, నర్సాపురం, తణుకు, ఆచంట వంటి నియోజకవర్గాల్లో అభ్యర్థులపై స్పష్టత ఇస్తూ అధిష్ఠానం సంకేతాలు ఇచ్చింది. తాడేపల్లిగూడెం విషయంలో కుస్తీ పడుతోంది. మంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యామ్నా యంగా అభ్యర్థులను ఎంపిక చేసి ఆరా తీస్తోంది. నియోజక వర్గంలో గుర్తించిన అభ్యర్థుల పేర్లతో కేడర్‌ను ప్రశ్నిస్తోంది. అభ్యర్థి రేసులో ప్రధానంగా ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్‌ఛైర్మన్ వడ్డి రఘురామ్ కూడా ఉన్నారు. ఇటీవలే అతనికి రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రఘురామ్ అయితే ఎలా ఉంటుందని సర్వే బృందాలు ఆరా తీస్తున్నాయి. మరోవైపు మంత్రి తనయుడు కొట్టు విశాల్ పేరును తెరపైకి తెచ్చింది. ప్రముఖంగా మాజీ ఎమ్మెల్యే పేరును కూడా అధిష్ఠానం పరిగణలోకి తీసుకుంది. ఆయనపైనా అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్టు కేడర్‌లో చర్చ సాగుతోంది. ఆయన పేరుతోనూ సర్వే చేపడుతున్నారు. ఇప్పటివరకు మంత్రి కొట్టు శిబిరంలో పూర్తి ధీమా ఉండేది. కొట్టు అనుచరవర్గమంతా ఆయనకే టిక్కెట్ ఖరారు అవుతుందని విశ్వసిస్తూ వచ్చారు. తాజాగా అధిష్ఠానం ఇతరుల పేర్లతో సర్వే చేయడం నియోజ కవర్గంలో చర్చకు దారితీసింది. అధిష్ఠానం కదలికలతో కొట్టు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర నేతలతో కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల నియోజక వర్గంలో పాదయాత్ర ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల్లో బరిలో ఉండేది తానేనంటూ కేడర్‌కు సంకేతాలు పంపారు. అయితే అధిష్ఠానం ఇప్పటికీ అభ్యర్థి విషయమై ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థిని మార్చనట్టయితే ఓటమితో పాటు, భవిష్యత్తులో పార్టీ మనుగడ కష్టమేనంటూ అధిష్ఠానం వద్ద నివేదిక ఉన్నట్టు సమాచారం. అయినాసరే తెలుగు దేశం-జనసేన కూటమికి దీటైన అభ్యర్థి మంత్రి కొట్టు సత్యనారాయణే అని విశ్వసిస్తున్నవారూ ఆ పార్టీలో ఉన్నారు.

అసంతృప్తుల సమావేశం

నియోజకవర్గంలో తాడేపల్లిగూడెం, పెంటపాడుకు చెందిన 15 మంది అధికార పార్టీ కీలక నాయకులు రెండు రోజుల క్రితం పట్టణంలో సమావేశమయ్యారు. అభ్యర్థి మార్పులు, చేర్పులపై చర్చించారు. నియోజకవర్గంలో అభ్యర్థిని మార్చక పోతే మూకుమ్మడిగా రాజీనామా చేయా లంటూ ఒక నిర్ణయానికి వచ్చారు. అధిష్ఠానం తుది జాబి తాను ఖరారు చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కీలక నాయకులు సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎందుకింత వ్యతిరేకత

తాడేపల్లిగూడెం నియోజకవర్గంపై తొలినుంచీ కేడర్‌లో అయోమయం నెలకొంది. ఐ-ప్యాక్ బృందాలు కొత్తవారి కోసం నియోజకవర్గంలో జల్లెడ పట్టాయి. తాజాగా 20 మంది బృందం పట్టణంలో మంత్రి పేరుతో సర్వే నిర్వహిస్తున్నాయి. అన్ని నివేదికలను పరిగణలోకి తీసుకుని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అభ్యర్థిని ఖరారు చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. కొట్టు విషయంలో అధిష్ఠానంలో పునరాలోచనలో పడడానికి క్షేత్రస్థాయిలో ఉన్న వ్యతిరేకతే కారణమంటున్నారు. నివేదికలు కూడా అదే స్పష్టం చేస్తున్నాయి.నియోజకవర్గంలో అక్రమ వసూళ్లతో పార్టీకి చెడ్డపేరు వచ్చిందంటూ అధిష్ఠానం నమ్ముతోంది. పట్టణంలో కీలక అధికారి చర్యలతోనూ కేడర్ విసిగివేసారింది. ఇవన్నీ కొట్టుపై ప్రభావం చూపుతున్నాయి.

చెక్ పోస్టుల్లో నిఘా పెట్టాలి : కలెక్టర్



భీమవరం, జనవరి 24 : ఎన్నికల చెక్‌పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తం కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఎన్నికల్లో ప్రలోభాలను నియంత్రించుటకు ఈసీ ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఎలక్షన్ సీజర్స్ మేనేజ్మెంట్ సిస్టం)ను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. దీనిపై వివిధ శాఖల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో పట్టుబడిన వస్తువులు, నగదు వంటివి పక్కాగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. మద్యం, నగదు, మాదక ద్రవ్యాలతో ఓటర్లను ప్రేరేపించే పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే ఇలాంటివి జరిగే అవకాశం ఉందన్నారు. మాదకద్రవ్యాలు, మద్యం ప్రభావిత ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, సెబ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వరరావు, ఇంకమ్‌టాక్స్ అధికారి కే.సత్యనారాయణ,ఎంపీడీవో వెంకట రమణ, ఫారెస్ట్ అధికారి ఎస్కే, ఫిరోజ్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ ఏసీ హేమమాలిని, లీడ్ బ్యాంకు ప్రతినిధి బీబీ నాయుడు,సెబ్ ఏఈ భార్గవ్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ వై.దుర్గా కిషోర్, డీటీ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

పెళ్లికీ బాదుడే !

వివాహ నమోదు ఫీజు పెంపు



భీమవరం, జనవరి 24 : హిందువుల పెళ్లి నమోదు ఫీజును భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. కొంతకాలం కిందట వివాహ నమోదు ఫీజులను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గతేడాదే జీవో జారీ అయిందని అధికారులు చెబుతున్నారు. సవరించిన ఫీజుల వివరాల ప్రకారం ఇంత వరకు రూ.200 ఉండగా దానిని రూ.500కు పెంచారు. వివాహ వేదిక వద్దకు సబ్ రిజిస్ట్రార్ వస్తే గతంలో రూ.210 వసూలు చేసేవారు. ఇప్పుడు దానిని ఏకంగా రూ.5 వేలకు పెంచేశారు. గతంలో వివరాలు తెలుసుకునేందకు కార్యాలయానికి వెళ్ళి రికార్డులు పరిశీలన చేస్తే అధికారంగా రూపాయి మాత్రమే తీసుకునేవారు. దానిని ఇప్పుడు రూ. 500కు పెంచుతూ సవరించారు. జిల్లాలో ఒక నెలలో 15 వందల వరకు వివాహాలు నమోదవుతున్నాయి. జిల్లా కేంద్రమైన భీమవరంతో పాటు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ పెళ్ళి నమోదు ప్రక్రియ ఉంది.

పెళ్ళి నమోదైతేనే రేషన్ కార్డు

సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు అర్హత కావడంతో వాటికి డిమాండ్ పెరిగింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఒక కుటుంబంలో యువకుడు పెళ్లి చేసుకుంటే అతనికి తెల్లరేషన్‌కార్డు అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకున్నా జారీ చెయ్యరు. ఆధార్ కార్డుతో పాటు, వివాహ రిజిస్ట్రేషన్ పత్రం జతపరిస్తేనే రేషన్‌కార్డు జారీ చేసే విధంగా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఖచ్చితంగా వివాహ అయినవారు నమోదు చేయించుకుంటున్నారు.

గవర్నర్‌ను కలిసిన ఉద్యాన వీసీ



వర్సిటీ రిపోర్టును గవర్నర్‌కు అందజేస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను బుధవారం రాజ్‌భవన్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీలో చేపట్టిన అభివృద్ధితోపాటు పరిశోధనలను వివరించారు. బి. శ్రీనివాసులు, ఈ. కరుణశ్రీ ఉన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

పెదపాడు, జనవరి 24 : జేఈఈ మెయిన్స్ పరీక్షలు మండలంలోని వట్లూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్‌లలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఆన్‌లైన్ విధానంలో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ పరీక్షలు జరుగ్గా సీఆర్‌రెడ్డి కళాశాలలో 85 మందికి 76 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 100 మందికి 93 మంది, సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 137 మంది హాజరయ్యారు.

నేరుగా టెట్ కం డీఎస్సీ రాతపరీక్ష నిర్వహించండి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 24 : రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు కలిసివచ్చేలా నేరుగా 'టెట్ కం డీఎస్సీ' నిర్వహించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సుధీర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా తాజా నోటిఫికేషన్‌లో చేర్చాలన్నారు. కొత్తగా డీఎడ్, బీఎడ్ పూర్తిచేసిన లక్షలామంది అభ్యర్థులు టెట్‌కోసం ఎదురుచూస్తున్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకితీసుకుని వేర్వేరుగా రెండు పరీక్షలు కాకుండా అందరికీ ఒకేసారి టెట్ కం డీఎస్సీ రాతపరీక్షను నిర్వహించడం సబబుగా ఉంటుందన్నారు. ఈ మేరకు సీఎం, విద్యాశాఖ మంత్రికి లేఖలు పంపినట్టు పేర్కొన్నారు.

నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాల నమోదుకు తుది గడువు 31

ఏలూరు ఎడ్యుకేషన్/భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : గతేడాది ఫిబ్రవరిలో జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలో జిల్లా నుంచి ఎంపికైన బాలబాలికలు తమ వివరాలను సంబంధిత నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ఈ నెల 31వతేదీని తుది గడువుగా కేంద్రం నిర్ణయించిందని డీఈవో శ్యాంసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మెరిట్‌కార్డులో నమోదు చేసిన ఆధార్‌కార్డులో పేరు, తదితర వివరాల్లో ఒక్క అక్షరం కూడా తప్పులేకుండా పోర్టల్‌లో సరిపోలినపుడే అప్‌లోడ్ అవుతుందన్నారు. మిస్‌మ్యాచ్ అయితే ఈ నెల 27లోగా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇటువంటి దరఖాస్తులన్నింటినీ ఫిబ్రవరి 15లోగా సంబంధిత స్కూలు నోడల్ ఆఫీసర్‌తో పరిశీలింపజేసి స్కూల్ లాగిన్‌లో ధృవీకరిస్తారని వివరించారు. 2019, 2021, 2022 సంవత్సరాల్లో స్కాలర్‌షిప్‌కు ఎంపికై ప్రస్తుతం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల/కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ వివరాలను పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అప్పుడు మాత్రమే ఉపకారవేతనం మంజూరవుతుందని స్పష్టంచేశారు. నిర్ణీత గడువులోగా ఈప్రక్రియను పూర్తిచేయకపోతే తల్లిదండ్రులు, హెచ్‌ఎంలదే బాధ్యతని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదోతరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్రం నిర్వహించే పరీక్షలో ఎంపికైనవారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమచేస్తారు.

ఓపెన్ స్కూల్‌లో తత్కాల్ ప్రవేశాలకు..

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ 2023-24 విద్యా సంవత్సరంలో చేరుటకు తత్కాల్ ప్రవేశములు ఈనెల 31 వరకు గడువు గలదని, ఆసక్తి గల విద్యార్థులు ఏఐ సెంటర్స్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చని డీఈవో ఆర్. వెంకటరమణ తెలిపారు. పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ఏపీఓఎస్ఎస్ ఏఐ సెంటర్స్ కోఆర్డినేటర్స్ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థుల వివరాలు, ఎస్ఆర్ఎస్ తప్పులు లేకుండా సరిచేయాలని, పరీక్షల తదుపరి కరెక్షన్స్ చేయబడవన్నారు. పీసీపీ క్లాసులు తప్పనిసరిగా నిర్వహించాలని, ఉపాధ్యాయులు హాజరు యాప్ తప్పక నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ విద్యార్థులు సర్టిఫికెట్స్ వెంటనే సమర్పించాలని లేని యెడల రాయితీలు ఇవ్వబడవన్నారు. స్టేట్ కోఆర్డినేటర్ శివకోటేశ్వరరావు, ఏఐ కోఆర్డినేటర్స్ ఉన్నారు.

పాఠశాల భవనాలు డీఈవో పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటరమణ

వీరవాసరం, జనవరి 24: మండలంలో తోలేరు శివారు పడమటిపాలెం, చింతలకోటిగరువు శివారు నడపనవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాలను డీఈవో ఆర్. వెంకటరమణ బుధవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఆయా పాఠశాల భవనాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలమేరకు పరిశీలించి, మంజూరైన నిధులు తదితర వివరాలను తెలుసుకున్నారు. నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, వేండ్ర లీలాకృష్ణ, శ్యాంసుందర్, రాజేష్, శ్రీమన్నారాయణ, స్వామినాయుడు పాల్గొన్నారు.

రాయకుదురు జడ్పీ హైస్కూల్ తనిఖీ

రాయకుదురు జడ్పీహైస్కూల్‌ను డీఈవో తనిఖీ చేశారు. పది విద్యార్థుల విద్యాబోధన, నూరుశాతం ఉత్తీర్ణతకు అనుసరించాల్సిన కార్యాచరణపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమీక్షించారు. చదువులో వెనుకబడిన సీ, డీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. రికార్డులను తనిఖీ చేశారు. హెచ్‌ఎం కానుకొలను శ్రీనివాసరావు, ఎంఈవో-2 శ్రీమన్నారాయణ ఉన్నారు.

అలరించిన సినీ మ్యూజికల్ నైట్



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

భీమవరంటౌన్, జనవరి 24 : మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కోటికలపూడి గోవిందరావు కళావేదికపై తణుకుకు చెందిన రాజు ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ నిర్వహించిన సినీ మ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. పలు చిత్రాల్లోని పాటను గాయకులు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. రాత్రి 8-30 కు మావుళ్ళమ్మ నాట్యమండలి వారిచే శ్రీకృష్ణ తులాభారం నాటకం ప్రదర్శించారు. తొలుత బోడపాడుకు చెందిన బాలమురళీకృష్ణ భక్త సమాజం భజన, ఉరదాలపాలెంకు చెందిన జగన్నాధపు వెంకటేశ్వరరావుచే భగవత్ పారాయణ, కొవ్వూరు దనుకొండ లిఖిత బృదంచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. గురువారం హరే శ్రీనివాస, భీమవరం భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం. నడింపల్లి రాజగోపాల రాజు(నరసాపురం)వారిచే ఆధ్యాత్మిక ప్రవచనం, జగన్నాధపు వెంకటేశ్వరరావు (ఉరదాలపాలెం) వారిచే భగవద్గీత పారాయణం, స్వరతరంగిణీ(భీమవరం)వారిచే సీనీమ్యూజికల్ నైట్, లింగాల సాయిబాబా సమర్పణలో మూడు రత్నాల నాటకం ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు వివరించారు.

రైతులకు పరిహారం తక్షణం విడుదల చేయాలి

చాట్రాయి, జనవరి 24: మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరెడ్డి, మండల కార్యదర్శి రావూరి వెంకట పిచ్చేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన రైతుల జాబితాలు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వానికి పంపి నెల రోజులు కావస్తున్నా స్పందించకపోవటం శోచనీయమన్నారు. ఎకరాకు రూ. 20 వేలు చొప్పున పెట్టుబడి రాయితీ తక్షణం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మేపాళచెట్టు కాయలు తిన్న 8 మంది చిన్నారులకు అస్వస్థత

- ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స.. ఆందోళన వద్దన్న వైద్యులు
- పూర్తిస్థాయిలో కోలుకుంటారని తల్లిదండ్రులకు భరోసా
- బేరన్ పొగాకు పనులకు గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలు



ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు



జంగారెడ్డిగూడెంలో..

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం, జనవరి 24 : బేరన్ పొగాకు పనులకు వచ్చిన వలస కూలీల పిల్లలు మేపాళచెట్టు కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పిల్లల ప్రత్యేక వైద్య బృందం వారిని పరీక్షించి ఎలాంటి ప్రాణాపాయం లేదని, మగతగా ఉన్నారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పూర్తిస్థాయిలో కోలుకుంటారని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన 22 మంది వలస కూలీలు నల్లజర్ల మండలం పోతవరంలో బేరన్ పొగాకు కొట్టే పనుల కోసం 12 రోజుల క్రితం వచ్చారు. వారితో పాటు 11 మంది పిల్లలు కూడా ఉన్నారు. పెద్దవారంతా ఉదయాన్నే పొగాకు కొట్టే పనులకు వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంటకు వస్తారు. భోజనం అనంతరం తిరిగి పొగాకు కొట్టడానికి వెళ్తారు. యథావిధిగా బుధవారం వారంతా పొలం పనులకు వెళ్లగా పిల్లలు ఇళ్ల వద్ద ఉన్నారు. వారి మకాం సమీపంలో మేపాళ చెట్లు ఉండడంతో వాటికి ఉన్న కాయలు కోసుకుని ఎనిమిదిమంది పిల్లలు తిన్నారు. వారికి వాంతులౌతుండ డంతో ఒంటిగంటకు వచ్చిన తల్లిదండ్రులు గమనించి వెంటనే కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి జంగారెడ్డిగూడెం.. రాత్రి 8.30 గంటలకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు.

ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంవో ప్రసాదరెడ్డి, చిన్నపిల్లల వైద్య చికిత్స విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎ.దీపక్‌కుమార్ బృందం కలిసి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటి వరకూ తమ పిల్లల పరిస్థితిపై ఆందోళన చెందు తున్న తల్లిదండ్రులకు ఆ వైద్య బృందం.. పిల్లలు మగతా ఉన్నారని ఎటు వంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆత్మస్థైర్యం కల్పించడంతో వారు తమ దేవుళ్లకు దండాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వారు చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ళకు చెందిన మాడా రిషికుమార్ (5), మందా అజయ్ (6), మాచవరం గ్రామ పరిధిలోని మల్లవోలుకు చెందిన ఏపూరి భవ్య (5), ఏపూరి స్వీటీ (3), కోసూరు మండలం నాగవరానికి చెందిన వడ్లమూడి ప్రశాంత్ (7), వడ్లమూడి ప్రసన్న (5), వడ్లమూడి చిన్ని (3), గుంటూరు జిల్లా పిల్లుట్లకు చెందిన చేడపొంగు ఆనందబాబు (6) ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

నాటు తుపాకులు స్వాధీనం చేసుకోండి : ఎస్పీ





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జనవరి 24 : ఏజెన్సీ, కొల్లేరు ప్రాంతాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నాటు తుపాకులను స్వాధీనం చేసుకోవాలని ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు అనుసరించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన బాలికల కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు. ప్రశాంతత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సమిష్టంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగు పర్చుకోవాలన్నారు. సమస్యలు సృష్టించే వ్యక్తులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. తుపాకుల లైసెన్సులను పరిశీలించాలన్నారు. మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణా నియంత్రించడానికి కార్డన్ సర్చ్ నిర్వహించాలన్నారు. అదనపు ఎస్పీ భాస్కరరావు, ఎస్ఐబి అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న క్రీడాకారులు

రిజిస్టర్ కాకుండా ఎలా ఆడతారు..

- వేములదీవి క్రికెట్ జట్టు అభ్యంతరం.. జిల్లాస్థాయికి ఎంపిక

నరసాపురం టౌన్, జనవరి 24: అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. వైఎన్ కళాశాలలో బుధవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రిజిస్టర్ చేసుకోని క్రీడాకారులు బరిలో దిగడంతో అప్పటి వరకు విజేతలుగా నిలిచిన వేములదీవి క్రికెట్ జట్టు ఆభ్యంతరం తెలిపింది. ఇరుజట్ల మధ్య వివాదం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్లితే..... ఇప్పటి వరకు జరిగిన పోటీలో వేములదీవి క్రికెట్ జట్టు దూసుకుపోతూ వచ్చింది. నరసాపురం అర్బన్ జట్టుతో ఫైనల్ మ్యాచ్ బుధవారం ఆడాల్సి ఉంది. అయితే టీమ్‌లోని క్రీడాకారులు రిజిస్టర్ కాకుండా బయట వ్యక్తుల చేత ఆడించడాన్ని వేములదీవి క్రీడాకారులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరు జట్ల క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. రిజిస్టర్ కాని క్రీడాకారులతో ఎలా ఆడిస్తారంటూ మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది వేములదీవి క్రీడాకారులను నిలదీశారు.ఆర్డీవో అంబరీష్, కమిషనర్ వెంకటేశ్వరావు జోక్యం చేసుకుని ఇరుజట్లు రిజిస్టర్ చేయించుకున్నారా లేదా అన్నది పరిశీలించారు. నరసాపురం అర్బన్ టీమ్ క్రీడాకారుల్లో కొందరు రిజిస్టర్ కాలేదని గుర్తించి వేములదీవి ఈస్ట్ జట్టును విజేతగా ప్రకటించారు. దీంతో జిల్లాస్థాయికి వేములదీవి క్రికెట్ జట్టు ఎంపికైనట్లుయింది.

31,1న కలెక్టరేట్‌ల ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

తణుకు, జనవరి 24: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ పక్షాన ఈనెల 31న, ఫిబ్రవరి 1న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహి స్తున్నట్టు సమాఖ్య రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ తెలిపారు. బుధవారం తణుకు మున్సిపల్ పాఠశాలను సందర్శించి పాఠశాల వద్ద నిరసన తెలిపారు. సమాఖ్య నాయకులు సుబ్బారావు, అంజిబాబు, హరికృష్ణ, సుజాత పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ముగిసిన చెస్ శిక్షణా శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీకష్ణంరాజు

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జేఎన్‌టీయూ కే చెస్ సౌత్‌జోన్ టీమ్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈనెల 26 నుంచి 29 వరకు తిరుచు నాపల్లిలోని భారతీ దాసన్ యూనివర్సిటీలో జరిగే పోటీలకు బుధవారం క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. సౌత్‌జోన్ పోటీలలో విజయం సాధించి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ కష్ణంరాజు అన్నారు. విజయవాడ ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి బి.జే.ఎస్.కె. రణధీర్, సూరంపూడి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి నాగదిలీప్, ఎస్ఆర్‌కెఆర్‌కు చెందిన ఎస్.ఎల్.డి. విజయ్, పి.ఎస్.ఆర్. కార్తీక్, ఏలూరు రామచంద్రకు చెందిన సిహెచ్.ఆదిత్యకృష్ణసాయి, అమలా పురం శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కె.గౌతమ్‌ధర్మ శిక్షణ పొంది నట్టు ఫిజికల్ డైరెక్టర్ పి. సత్యనారాయణరాజు వివరించారు. అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సిహెచ్. హరిమోహన్, జి. సారిక, అవినాష్ ఉన్నారు.

చెన్నై, చండీఘడ్ పోటీలకు వెయిట్‌లిఫ్టర్ల ఎంపిక

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 24: చెన్నైలో ఈనెల 26 నుంచి 30 వరకు జరిగే యూత్ నేషనల్ ఖేలో ఇండియా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు, చండీఘడ్‌లో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే అఖిలభారత అంతర్‌విశ్వవిద్యాలయ పోటీలకు ఏలూరు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వెయిట్‌లిఫ్టర్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.సర్వేశ్వరరావు బుధవారకం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.అరుణేష్‌బాబు, బి.ప్రేమ్‌సాగర్, ఆర్.భవానీ, ఎ.రేవతి ఖేలో ఇండియా యూత్‌గేమ్‌కు, టి.మధుబాబు, ఈ.కోటేశ్వరరావు, కుమారస్వామి, కోమల్‌కార్తీక్, ఎన్.వి సత్యనారాయణ, వి.ప్రశాంత్, డి.మౌలాలీ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఖేలో ఇండియాపోటీలకు ఎం.రమేష్‌బాబు, వి.సందీప్ కోచ్‌లుగా, రమేష్‌బాబు, సందీప్, టి.దీన్స్‌బాబు మేనేజరుగా వ్యవహరిస్తారు. అఖిలభారత విశ్వవిద్యాలయ పోటీలకు ఎ.శ్రీనివాసరావు కోచ్‌గా మేనేజర్లుగా టి.టి.వి.ఎల్ శ్రీకర్ వ్యవహరిస్తారు.

ఆవును చంపిన పులి

- ఎర్రాయిగూడెం-మంగదేవిపేట ప్రాంతాల్లో సంచారం
- భయాందోళనల్లో మన్యం బిడ్డలు





పులి దాడిలో మరణించిన ఆవు, పరిశీలిస్తున్న అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు





పులి పాదముద్ర, ఏర్పాటు చేస్తున్న ట్రాప్ కెమెరా

బుట్టాయగూడెం/కొయ్యలగూడెం, జనవరి 24: మండలంలోని ముంజులూరు గ్రామ పరిధిలోని చింతమొక్కబాట వద్ద సోమవారం పులి, ఆవును చంపి తిన్న ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో మన్యం బిడ్డలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మన్యంలో పులి సంచారం నిజం కావడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి వణికిపోతున్నారు. ఏసమయంలో ఎటునుంచి వచ్చి తమపై దాడిచేస్తుందోనని గగ్గోలు పెడుతున్నారు. అటవీ ప్రాంతంలో కొండరెడ్లు ప్రాణాలను అరచేతపట్టుకుని కాలం గడుపుతున్నారు. అడ్డమడుగు గుంపునకు చెందిన కొండరెడ్ల ఆవుగా అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ అధికారులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కన్నాపురం అటవీశాఖ అధికారి కె.కృష్ణకుమారి, వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో జె.ప్రభాకర్, ఎఫ్ఎస్‌వో మూర్తి సిబ్బందితో కలిసి బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి పులి పాదముద్రలను సేకరించారు. ఆవు మృతదేహం వద్దకు పులి మరోసారి వచ్చే అవకాశం ఉన్నందున దాని జాడ కనుగొనడానికి ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో ప్రభాకర్ తెలిపారు. ఆవును చంపింది పెద్దపులేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కామయ్యకుంట మీదుగా లంకపల్లి అటవీ ప్రాంతం గుండా అభయారణ్యంలోకి వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. పులిని పట్టుకునేందుకు మరిన్ని ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో కొండరెడ్లు ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపరులు పెద్దపెద్ద శబ్దాలు చేస్తుండాలన్నారు.

ఇదిలా ఉండగా, పశ్చిమ ఏజెన్సీలో పెద్దపులి సంచరిస్తున్నట్లు వారం రోజులుగా మన్యంవాసులు గగ్గోలు పెడుతున్నా అవన్నీ పుకార్లేనంటూ అటవీశాఖ అధికారులు కొట్టిపారేశారు. పులి పాదముద్రలు గుర్తించి సమాచారం ఇచ్చినా అవి అడవి పిల్లివని అని నిర్ధారించేశారు. ఎర్రాయిగూడెం-మంగదేవిపేట పరిసర ప్రాంతాల్లో పులి జాడను గ్రామస్థులు గుర్తించి అధికారులకు సమాచారమిచ్చినా పులి కాదన్నారు. గెడ్డపల్లి, చింతపల్లి, ముంజులూరు,రెడ్డికోపల్లె, ఎర్రాయిగూడెం, మంగదేవిపేట ప్రాంతాల్లో సంచరించినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఇటీవల గెడ్డపల్లిలో ఆవు దూడను లాక్కుపోగా రెడ్డికోపల్లె ప్రాంతంలో మేకపై దాడి చేసినట్టు తెలిపారు.

దిప్పకాయలపాడు పొలాల్లో పులిజాడలు..

కొయ్యలగూడెం మండలంలో పెద్దపులి సంచారం కనపడింది. బయ్యన్నగూడెం పొలాల్లో జాడలు కనిపించటంతో రైతులు భయందోళనకు గురయ్యారు. బుట్టాయిగూడెం మండలం నుంచి యర్రాయిగూడెం, దిప్పకాయలపాడు మీదుగా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం కేతవరం వైపునకు వెళ్లినట్లు అడుగుజాడలను బట్టి చెబుతున్నారు. ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు.

వేల్పూరు పంచాయతీ నిధులు గోల్‌మాల్!

- కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి రూ.17,90,000
- అధికారులు తగు చర్యలు చేపట్టాలి : సర్పంచ్



మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణవేణి

ఇరగవరం, జనవరి 24 : పంచాయతీ నిధులు దుర్వినియోగంకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వేల్పూరు సర్పంచ్ విశ్వనాధం కృష్ణవేణి అన్నారు. వేల్పూరు గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వేల్పూరు గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గంగాధరరావు, 15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచ్ ప్రమేయం లేకుండా రూ. 17,90,000 తన ఖాతీలోకి మళ్లించుకున్నాడు. ఈ విషయంపై సర్పంచ్ విశ్వనాధం కృష్ణవేణి, వార్డు సభ్యులు కార్యదర్శిని వివరణ అడిగితే పొంతన లేని సమాధానం చెబుతూ చివరకు తన అకౌంట్‌లో ఉందని ఒప్పుకున్నాడు. దీనిపై తక్షణమే సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌డిమాండ్ చేశారు.

ప్రతి జిల్లా కేంద్రంలో హ్యాండీ క్రాఫ్ట్ బజార్

నూజివీడు, జనవరి 24: చేతివృత్తిదారుల సంక్షేమానికి ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీ క్రాఫ్ట్ బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బడిగించల జయలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణంలో వీణల తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. దాదాపు 17 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న వీణల తయారీదారు షేక్ మాబును సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ హ్యాండీక్రాఫ్ట్ బజారులను ఏర్పాటు చేసేందుకు స్థలాలను సేకరిస్తున్నామన్నారు. కళాకారులైన మహిళలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వీణల తయారీకి శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన మాబూకు భూమిని మంజూరు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు.

క్రైం కార్నర్



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సంఘాల నేతలు

కనకదుర్గమ్మ పీఠాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయండి

- పోలీస్ స్టేషన్ ఎదుట హిందూ సంఘాల ఆందోళన

ద్వారకాతిరుమల, జనవరి 24: హిందూ ఆధ్యాత్మిక కేంద్రాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చాలన్న డిమాండ్‌ను కాదన్నందుకు ఆలయ పీఠాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధితులు పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. తమవెనుక గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, హోం మంత్రి ఉన్నారని, తమను ఎవరూ ఏమీ చేయలేరంటూ బెదిరిస్తున్నట్లు వాపోయారు. తొలుత హిందూ సంఘాల ఐక్యవేదిక నేతలు, స్థానికులతో కలసి తిమ్మాపురం శివారులో ధ్వంసానికి గురైన కనకదుర్గమ్మ పీఠాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని కనకదుర్గమ్మ పీఠాన్ని ధ్వంసం చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయడంతో పాటు వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భీమడోలు సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరుపగా తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

ఆక్వా చెరువులో పడి యువకుడి మృతి

కాళ్ళ, జనవరి 24 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జువ్వలపాలెంలో చోటు చేసుకుంది. వివరాలివి. కొవ్వూరుకు చెందిన వడ్లమూడి వెంకటరాజు (37) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. కొద్ది రోజుల క్రితం జువ్వలపాలెం వచ్చాడు. అతిగా మద్యం తాగి ఆక్వా చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన రైటర్, ఏఎస్ఐ

- 41(ఏ) నోటీసు ఇవ్వడానికి లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం



పోలీసుల అదుపులో ఏఎస్ఐ వెంకన్నబాబు, స్టేషన్ రైటర్ రమణ

ఏలూరు క్రైం, జనవరి 24 : మద్యం బాటిళ్లతో పట్టుబడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి ఆపై సీఆర్పీసీ 41(ఎ) నోటీసు ఇవ్వడానికి లంచం తీసుకుంటున్న ఏలూరు రూరల్ స్టేషన్ రైటర్ డి.వి.రమణ, ఏఎస్ఐ వెంకన్నబాబును ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి స్టేషన్ వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ వివరాల ప్రకారం.. రూరల్ మండలం ప్రత్తికోళ్ళలంకకు చెందిన సైదు రామ్‌కుమార్ వద్ద ఆరు మద్యం బాటిళ్లు ఉండడంతో అతడిని పోలీసులు ఈనెల 12న అదుపులోకి తీసుకుని క్రైం నెంబర్ 17/2024గా కేసు నమోదు చేశారు. అయితే అతడికి సీఆర్పీసీ 41(ఎ) కింద నోటీసు ఇవ్వడానికి రూ.10 వేలు లంచం రైటర్ డిమాండ్ చేశాడు. చివరకు ఎనిమిది వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడానికి ఇష్టంలేని రామ్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు బాస్కరరావు, కె. నాగేంద్ర ప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద నిఘా పెట్టారు. స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉండడంతో రామ్‌కుమార్‌ను స్టేషన్ ఎదురుగా ఉన్న ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు తీసుకువెళ్లి లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏఎస్ఐ కె.వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు) ఆ కేసు దర్యాప్తు తానే చేస్తున్నానంటూ వెయ్యి రూపాయలు ఫోన్‌పే చేయించుకున్నాడు. ఏసీబీ అధికారులు వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అదే సమయంలో స్టేషన్ రైటర్ రమణ, ఏసీబీ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. వెంటనే కస్టడీలోకి తీసుకుని స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అనంతరం సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్టు చేశారు. విజయవాడలో ఉన్న ఏసీబీ కోర్టులో గురువారం హాజరుపర్చనున్నారు.

మహిళపై దాడి.. ఇద్దరి అరెస్టు

భీమడోలు, జనవరి 24 : కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వెళ్తున్న మహిళపై దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఈ నెల 23న భీమడోలు ఇందిరా కాలనీకి చెందిన కాసం యామిని కారు డ్రైవింగ్ నేర్చుకోవడానికి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఖాళీ ప్లాట్లలోకి డ్రైవర్‌ను తీసుకువెళ్లారు. అక్కడే ఉన్న భీమడోలుకు చెందిన మద్దా కల్యాణ్, నూకల ప్రవీణ్‌కుమార్ వీరిపై దాడి చేసి సొమ్ము లాక్కుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులిద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

హోటల్ యజమాని అరెస్ట్

భీమడోలు, జనవరి 24 : నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలెండర్లను వినియోగిస్తున్న హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేసినట్లు సివిల్‌సప్లై డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు తెలిపారు. స్థానిక శ్రీవిజయభవానీ హోటల్‌లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గృహ వినియోగానికి ఉపయోగించే ఐదు సిలెండర్లను స్వాధీనపర్చుకుని కేసు నమోదుచేశారు. సీఐ విల్సన్ పాల్గొన్నారు.

ఏడోరోజూ సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 24 : తనకు రావల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సురెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ గత ఏడు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఎక్కిన వ్యక్తి బుధవారం కూడా దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే ఉన్నారు.

నాడు-నేడు పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

భీమవరం,జనవరి 24 : నాడు-నేడు పనుల్లో భాగంగా అదనపు తరగతి గదులు నిర్మించిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర వాటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం మన బడి-నేడు పనులపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో మండలాల వారీగా నాడు-నేడు పనులు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్, పబ్లిక్ హెల్త్ వారి పరిధిలో ఉన్న పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను రానున్న 20 రోజుల్లో పూర్తి చేసి, సంబంధిత ఫొటోలతో సహా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలుగా ప్రతిపాదించిన పాఠశా లను నాడు-నేడు పనులతో పూర్తిచేసి సిద్ధం చేయాలన్నారు. ఇంకా నిధులు మిగిలితే పాఠశాల ప్రహరీలకు ఉపయోగించాలన్నారు. డీఈవో ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష పీవో పి.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం పురస్కరించుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

● భారత గణతంత్ర వేడుకలను శాఖాధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల నిర్వహణకు సంబంధించిన అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహిం చారు. కలెక్టరేట్ పక్కన ఉన్న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమా నికి ఆర్డీవోను పర్యవేక్షణ అధికారిగా నియమించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై స్టాల్స్ శకటాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకం

▸▸ నాలుగు డిపోల్లో డ్రైవర్లకు ఆర్ఎం అభినందన


తణుకు బస్ కాంప్లెక్స్‌లో డ్రైవర్లను అభినందిస్తున్న ఆర్ఎం వీరయ్యచౌదరి

భీమవరంటౌన్/ తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24 : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లాలోని నాలుగు డిపోలలో బుధవారం బస్‌స్టాండ్ ప్రాంగణంలో 'థాంక్యూ డ్రైవర్ గారూ, హ్యాపీ డ్రైవర్స్‌డే' కార్యక్రమం నిర్వహించారు, అనంతరం జరిపిన రోడ్ షోలో ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లకు గులాబీలు, చాక్లెట్‌లు ఇచ్చి డిపో మేనేజర్లు అభినందనలు తెలిపారు. డ్రైవర్స్‌డే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి వీరయ్య చౌదరి తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం డిపోలను సందర్శించి డ్రైవర్లకు గులాబీలు, చాక్లెట్‌లు ఇచ్చి అభినందనలు తెలిపి మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో ఎంతో చాకచక్యంగా బస్సులను నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుటలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. ఆర్టీసీ వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర చాలా కీలకమని భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి అన్నారు. అనంతరం భీమవరంలో ఆరుగురు ఉత్తమ డ్రైవర్లు ఆర్‌వీ రాజు, టీవీ రాజు, కేవీ రావు, కేజీ రాజు, ఎంకే రావు, టీపీ రాజులను సత్కరించారు. తాడేపల్లిగూడెంలో డిపో మేనేజర్ ఏలూరి సత్యనారా యణమూర్తి, కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, జనవరి 23: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 25న రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. జనరల్ మెడిసిన్, క్యాన్సర్, స్త్రీల సంబంధ వ్యాధులు, చిన్నపిల్లలు, గుండె సంబంధ వ్యాధుల నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ , ఎకో టూడీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంజలి పాఠశాలకు రూ.25 వేలు సాయం

పాలకొల్లు టౌన్, జనవరి 24 : పాలకొల్లు అంజలి మానసిక వికలాంగుల స్కూల్‌కు పోడూరుకు చెందిన దాత రుద్రరాజు వరహాలరాజు రూ.25వేలు చెక్కును అందించారు. దాత వరహాలరాజు మాట్లాడుతూ వికలాంగులకు అందిస్తున్న సేవలకు గాను గత ఏడాది రూ.25వేలు చెక్కును అందించానన్నారు. ఈఏడాది కూడా రూ.25వేలు చెక్కును అంజలి స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ విడివి. ప్రసాదరావుకు అందజేశారు.

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

ఇరగవరం, జనవరి 24 : బెంగుళూరు మహిళా హెల్త్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో రేలంగిలో మహిళలకు ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును బుధవారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు పసుపులేటి వెంకట రామారావు ఆర్థిక సాయంతో చేపట్టిన ఈ శిబిరంలో మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ క్యాన్సర్, కొవ్వు గడ్డల నిర్ధారణకు పరీక్షలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

టీడీపీ నేత సత్యనారాయణకు పితృవియోగం



పాలకొల్లు రూరల్, జనవరి 24 : దగ్గులూరుకు చెందిన టీడీపీ మండల ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ శాగా సత్యనారాయణ తండ్రి అంకయ్య(85) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అంకయ్య మృతిపట్ల ఎమ్మెల్యే రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు కోడి విజయ భాస్కర్, కార్యదర్శి పాముల రజిని, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలి

పెనుమంట్ర, జనవరి 24 : ఆలుమూరులో దళితులకు శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవో ప్రకారం రెండు ఎకరాలు కేటాయించాలని ఉంది అని ఆప్రకారం దళితులకు శ్మశాన వాటిక కేటాయించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, పెనుమంట్ర మండల అధ్యక్షుడు కుసుమె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం


నిమ్మలను సన్మానిస్తున్న బీసీ నేతలు

పాలకొల్లు టౌన్, జనవరి 24: రాష్ట్రంలో అధికారంలోకి రాబోయే టీడీపీ, జనసేన ప్రజాప్రభుత్వం లో బీసీల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పనిచేస్తానని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక కిరాణా వర్తకుల సంఘ భవనంలో బుధవారం 'జయహో బీసీ' సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఏఒక్కరికీ సబ్సిడీ రుణాలు అందలేదన్నారు. పాలకొల్లు నడిబొడ్డున నీసీ దర్శికుడు కోడి రామకృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటుకు బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. పెచ్చెట్టి బాబు, చంద్రమౌళి, కర్నేన రోజారమణి, కడలి గోపాలరావు, ధనాని సూర్యప్రకాష్, పాలవలస తులసీరావు, పొట్నూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

తణుకు, జనవరి 24: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9న తణుకు జిల్లా కోర్టుల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్‌పర్సన్ డి. సత్యవతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని సివిల్, రాజీపడదగిన క్రిమినల్ తదితర కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

తాడేపల్లిగూడెం పట్టణ సీఐగా సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24: తాడేపల్లిగూడెం పట్టణ సీఐగా ఎ. సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐగా పనిచేసిన నాగరాజు కమిషనరేట్‌కు బదలి కావడంతో సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పట్టణ సిబ్బంది అభినందనలు తెలిపారు.

'విద్యార్థులు జంతు ప్రేమికులుగా ఉండాలి'

భీమవరంటౌన్, జనవరి 24 : విద్యార్థులు జంతు ప్రేమికులుగా ఉండాలని, జంతు పరిరక్షణ సామాజిక బాధ్యత అని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక చైతన్య హైస్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా పశు సంవర్థక శాఖ, జిల్లా జంతు పరిరక్షణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతు పరిరక్షణ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు జంతు పరిరక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ కృష్ణంరాజు, డాక్టర్ ఎ.సత్యవతి జంతు పరిరక్షణపై వివరించారు. చెరుకువాడ రంగసాయి విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం 84మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

చంద్రబాబుతోనే ఆక్వారంగం అభివృద్ధి

▸▸ ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు


జక్కరంలో ఎమ్మెల్యేకు హారతిస్తున్న మహిళ


తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి

ఆకివీడురూరల్, జనవరి 24:రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే ఆక్వారంగం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. కోళ్ళపర్రులో 'బాబుతోనే భవిష్యత్ కార్యక్రమం, ఇంటింటికి తెలుగుదేశం'లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరితో ఆక్వారంగం దయ నీయ పరిస్థితిలో ఉందన్నారు. నాణ్యమైన సీడ్ లభించడం లేదని, సరైన ధర పలక డం లేదని, కోల్డ్ స్టోరేజీల సమస్య ఉందన్నారు. కోట్లాది రూపాయలు విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించే ఆక్వారంగం ప్రభుత్వ ప్రోత్సాహం లేక రైతులు నష్టాలు పాలవుతున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆక్వాజోన్, పరిమితి లేకుండా అందరికి విద్యుత్ సబ్సిడీ రూ.1.50కే యూనిట్ అందిస్తా మని ప్రకటించారన్నారు. పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాదు, నౌకట్ల రామారావు, ఎంపీటీసీ మంతెన రామచంద్రరాజు, జి.సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, పెదకాపు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

● కాళ్ళ : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, తెలుగు రాష్ట్రాల్లో మహిళలు సాగిస్తున్న ప్రగతి పథానికి టీడీపీ ప్రభుత్వం వేసిన పునాదులే కారణమని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. బుధవారం జక్కరంలో ఇంటింటికి తెలుగుదేశం, బాబుతో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్యపాన నిషేధం చేస్తామని మహిళలు ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పిచ్చి మద్యంతో మహిళల మాంగళ్యాలు తెంచుతుందని విమర్శిం చారు. టీడీపీ మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, పెన్మెత్స సత్యనారాయణరాజు, మంతెన కోదండరామరాజు, మంతెన సుబ్బరాజు, తోట ఫణిబాబు, బండారు వేణుగోపాలరావు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, జుత్తిగ శ్రీనివాస్, పుప్పాల బుజ్జి, ఆరేటి తాతపండు, అబిరుచి కాశీరాజు తదితరులు పాల్గొన్నారు.

● మొగల్తూరు, : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు తెలిపారు. బుధవారం గోడావారిపేటలో నిర్వహించిన భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ బాండ్లను అందించారు. టీడీపీ నాయకులు బొల్లా చంటి, మెడగల్పు సువర్ణరాజు, చెల్లుబోయిన పెద్దిరాజు, పాలా గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి'


కంచుస్తంభంపాలెంలో టీడీపీ, జనసేన శ్రేణులు

యలమంచిలి, జనవరి 24: దళిత వర్గాలకు జగన్ ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించి వెంటనే అమలుచేయాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కంచుస్తంభంపాలెం, దొడ్డిపట్ల గ్రామాల్లోని దళితవాడల్లో టీడీపీ, జనసేన నాయకులు 'దగా పడిన దళితజాతి కార్యక్రమం' బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిధుల నిర్వీర్యంపై వివరించి కరపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి దళితవర్గానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కొండేటి జీవరత్నం, ముప్పిరి సత్యనారాయణ, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, కృష్ణ పాల్గొన్నారు.

ఆసరా పేరుతో టోకరా : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 23: ఆసరా పేరుతో సీఎం జగన్మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలను మోసం చేస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో పసుపు కుంకుమ పథకంలో భాగంగా రూ. 10 వేల కోట్లు డ్వాక్రా మహిళలకు అందజేశారని, అయినా టీడీపీ డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ముప్పిడి రమేష్, సురగాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



భీమవరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మహేశ్వరరావు


నరసాపురం ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రాజ్యలక్ష్మి

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : డాక్టర్ సీఎస్ఎన్ విద్యా సంస్థలు, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ, వైద్యశాఖ, శిశు సంక్షేమశాఖ అధికారులు విచ్చేసి బాలికలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. జిల్లా డబ్ల్యూడీసీడబ్ల్యూ అండ్ ఈవో బి.సుజాతరాణి, ఎం.మమత, డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు: నేటి పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా స్త్రీలకు ఉపాధి అవకాశాలు ఉన్నందున విద్యార్థినులు ఉన్నత చదువుల్లో పోటీపడాలని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్, వనిత క్లబ్, భాష్యం విద్యా సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. మహేశ్వరి, స్వర్ణలత, భరిణి, భరతి, కమాల, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య-పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయుడు వర్ధమాన రవిశంకర్ అంగన్‌వాడీ సిబ్బంది మహిళా పోలీసులు విద్యార్థులకు వివరించి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● ఆకివీడు/కాళ్ల, : ఆకివీడు బాలికల ఉన్నత పాఠశాలలో యూపీహెచ్‌సీ వైద్యుడు వెంకటపతిరాజు మాట్లాడుతూ ఆడపిల్ల చదువు అవనికి వెలుగని అన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుండేలా తమ పిల్లలను తల్లిదండ్రులు తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల హెచ్ఎం ఇందిర, యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఆశాబీబేగం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు. కాళ్ల మండలం కాళ్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవానికి హాజరైన తహసీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించి, బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.

● పాలకొల్లు రూరల్ : భ్రూణహత్యలు అరికడదాం.. బాలికలను బతకనిద్దాం అనే స్లోగన్‌తో ఆడపిల్లల సంరక్షణ పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక హైస్కూల్‌లో లంకలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ కోరారు. స్కూల్ హెచ్ఎం జిబిజె.ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● తణుకు/అత్తిలి : బాలికల సంరక్షణ హక్కులు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించడమే జాతీయ బాలికా దినోత్సవం లక్ష్యమని పైడిపర్రు జడ్పీ హైస్కూల్ సమావేశంలో హెచ్ఎం ఏడుకొండలు అన్నారు. తేతలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రంగయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అత్తిలి మండలం మంచిలి ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.మహాలక్ష్మి ఆధ్వర్యంలో, ఆరవల్లి జడ్పీ హైస్కూలులో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహాలుపై అవగాహన కల్పించారు. హెచ్ఎం వి. అనంతలక్ష్మి, మహిళా పోలీసు లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు యాజమాన్య చట్టం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు, జనవరి 24:ప్రజల ఆస్తులకు రక్షణ లేని భూహక్కు యాజమాన్య చట్టం రద్దు చేయాలని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. బుధవారం బార్ అసోసియే షన్ ఆధ్వర్యంలో 33వ రోజు దీక్ష కొనసాగించారు. శిబిరంలో కార్యదర్శి కేఎస్ఎస్ మూర్తి, మృత్యుంజ యరావు, నాగేశ్వరరావు, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద స్వీపర్ల నిరసన

తణుకు, జనవరి 24: మున్సిపల్ పాఠశాలల స్వీపర్లకు తొమ్మిది నెలలుగా బకాయి వేతనాలు వెంటనే చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీపీ ప్రతాప్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనజర్‌కు వినతి పత్రం అందజేశారు. స్వీపర్లు శారద, సత్యవతి, జయకుమారి, ధనలక్ష్మి, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి : ఆర్డీవో

భీమవరంటౌన్/నరసాపురంటౌన్, జనవరి 24 :యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచు కోవాలని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందవచ్చని మునిసిపల్ స్పెషలాఫీసర్, ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమములో భాగంగా భీమవరం నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు స్థానిక లూథరన్, డీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యాయి. మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, భీమవరం మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవోలు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. నరసాపురం వైఎన్ కళాశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఆర్డీవో అంబరీష్‌తో కలిసి ప్రారంభించారు. కమిషనర్ వెంకటేశ్వరావు, తహసీల్దార్ ఫాజిల్, ఛైర్‌పర్సన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● యలమంచిలి : పాలకొల్లు పట్టణంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం.. ఆంధ్రా నియోజకవర్గస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీల్లో యలమంచిలి జట్లు ప్రథమస్థానం సాధించాయి.

● ఆచంట : నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు బుధవారం కొడమంచిలిలో ప్రారంభమయ్యాయి. కొడమంచిలిలో వాలీబాల్ పోటీలను స్థానిక సర్పంచ్ సుంకర సీతారామ్, ఎంపీడీవో నరసింహవరప్రసాద్, తహసీల్దార్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాశ్‌రెడ్డి, అధికారులు ప్రారంభించారు.

● ఉండి : నియోజకవర్గస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో భాగంగా బుధవారం ఉప్పులూరులో జరిగిన పోటీల్లో ఆకివీడు మండలం చెరుకుమిల్లి జట్టు ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం జట్టు విజయం సాధించింది. విజేత కబడ్డీ జట్టుకు డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహ రాజు అభినందనలు తెలిపారు. సర్పంచ్ సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, తదితరులు అభినందనలు తెలిపారు.

నరసాపురం ఎంపీడీవోగా రమణరావు

నరసాపురం రూరల్, జనవరి 24: నరసాపురం ఎంపీడీవోగా ఎంవీ రమణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణా జిల్లా డ్వామా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన వీరభద్రరావు కార్యాలయ సూపరింటెండెంట్‌గా కొనసాగనున్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర


అమ్మవార్లకు హారతిస్తున్న మహిళలు

వీరవాసరం, జనవరి 24 : తోలేరు గ్రామ దేవతలు పోలేరమ్మ, దండుగంగా లమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో జాతరలలో గరగల నృత్యాలతో పాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోయ డాన్స్‌లు, కాళికా నృత్యాలను ఏర్పాటు చేశారు. అమ్మవార్ల గ్రామోత్సవంలో భాగంగా పలు కుటుంబాలు అమ్మవార్లకు వారివారి ఇళ్ళల్లో పొన్నులు వేశారు. హారతులిచ్చి నైవేద్యాలను సమర్పించారు.


మండెల శ్రీనివాస్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న చేగొండి

వైసీపీ నేత శ్రీనివాస్‌కు జనసేన తీర్థం

ఆచంట, జనవరి 24: వైసీపీ నేత కాపు నాడు జిల్లా అధ్యక్షుడు మండెల శ్రీనివాస్ జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చేగొండి సూర్యప్రకాష్ సమక్షంలో శ్రీనివాస్‌కు జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాది బాలాజీ, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు వెలగల దాసు దానయ్య, వైస్ ఎంపీపీ యర్రగొప్పుల నాగరాజు, నంబూరి విజయ్, కుంపట్ల రమేష్, రావి హరీశ్, పితాని లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

31న చలో విజయవాడ విజయవంతం చేయాలి

తణుకు, జనవరి 24: సీఎం జగన్ హామీ మేరకు రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 31న చలో విజయవాడ విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి కోరారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు తరలి రావాలని కోరారు.

నెలాఖరులోగా ఊడ్పులు పూర్తి చేయాలి

నరసాపురం రూరల్, జనవరి 24: దాళ్వా నారుముడులు వేసుకున్న రైతులు ఈనెలాఖరు లోపు ఊడ్పులు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి కోరారు. ఇప్పటికే గ్రామాలవారీగా సిబ్బందితో సమావేశాలు నిర్వహించి వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. రైతులందరూ ఒకేసారి ఊడ్పులు చేయడం వల్ల సమయం కలిసివస్తుందన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు ఉన్నాయన్నారు.

'పరకాల ట్రస్ట్' సాయంతో సైకిల్ షెడ్


సైకిల్ షెడ్‌ను ప్రారంభిస్తున్న పరకాల ట్రస్ట్ ఛైర్మన్ సూర్యమోహనరావు

యలమంచిలి, జనవరి 24: పరకాల ట్రస్ట్ సహకారంతో కాజ జడ్పీ హైస్కూల్లో నిర్మించిన సైకిల్ షెడ్‌ను ట్రస్ట్ ఛైర్మన్ పరకాల సూర్యమోహనరావు బుధవారం ప్రారంభించారు. పాఠశాలలో హెచ్ఎం లియాఖత్ ఆలీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు ట్రస్టీ రాజేశ్వరరావు మాట్లాడారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. సైకిల్‌షెడ్ నిర్మాణానికి కృషిచేసిన కొప్పినీడి సర్వేశ్వరరావు, గోటేటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి చేయూతనందించిన పరకాల ట్రస్ట్, స్థానిక దాతలకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుబ్బల వేణు, బుడితి జయరాజు, మద్దాల అంజిబాబు, ఎంపీటీసీ సభ్యుడు జిల్లెళ్ల రత్నంరాజు, విద్యాకమిటీ ఛైర్మన్ కడలి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'శివారు మెరక భూములకు సాగునీరందిస్తాం'

గణపవరం, జనవరి 24: దాళ్వాలో శివారు మెరక భూములకు సాగునీరందిస్తామని ఏఈ వెంకటేశ్వరరావు, వ్యవసాయధికారి వైఎస్ ప్రసాద్ అన్నారు. జల్లికొమ్మర ఆయకట్టులో లంక భూములకు సాగునీరందక పొలాలు బీటలువారుతున్నాయని రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుధవారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జల్లికొమ్మర, అర్థవరం, కొత్తపల్లి, ముగ్గళ్ళ ఆయకట్టు భూములను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగైదు రోజులుగా మరమ్మతుల దృష్ట్యా సాగునీటి లెవల్స్ తగ్గాయని, 1500 క్యూసెక్కుల సాగునీటిని పెంపొందించామన్నారు. వరిచేలకు నీటి ఎద్దడి ఉండదని రైతులకు హామీ ఇచ్చారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు పరిశీలించాలి

గణపవరం, జనవరి 24: పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన తుది ఓటర్ల జాబితాలో సవరణలు, అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని బీఎల్‌ఓలను ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖజావలీ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, బీఎల్ఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబిత ప్రచురణ చేశామని, ఆ జాబితాలో అభ్యంతరాలు ఉంటే నివేదిక రూపంలో సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ పమ్మి లక్ష్మి, వీఆర్వోల సంఘం అధ్యక్షులు నిడమర్తి కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కొరత లేకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కాళ్ళలో పంట కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ వ్యవసాయశాఖ అధికారులు

కాళ్ళ, జనవరి 24 : వ్యవసాయానికి సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఏఈ ఫణిశంకర్, ఏవో సీహెచ్ జయవాసుకి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'నదుల్లో నీరున్నా.. సాగునీటికి కటకట..!' కథనానికి స్పందించిన నీటి పారుదలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం కాళ్ళలోని పంటకాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారులను చుట్టుముట్టి కాలువల్లో నీరు లేక నాట్లు వేసుకోవడానికి కూడా వీలు పడడం లేదని తమ గోడును వెళ్ళబుచ్చు కున్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ కె.లంక పంట కాలువకు నీరు విడుదల చేశామని గురువారం ఉదయానికి పూర్తిస్థాయిలో నీరు వస్తుందని స్పష్టం చేశారు.

'పెదతాత, నారాయణరాజును ఎంతో గౌరవిస్తాం'


మాట్లాడుతున్న గోకరాజు నరసింహరాజు

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : గన్నాబత్తుల పెదతాత, దంతులూరి నారాయణరాజుకు ఎంతో గౌరవం ఇస్తామని డీఎన్నార్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు అన్నారు. బుధవారం భీమవరంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎన్నార్ క్రీడామైదానం వద్ద గన్నాబత్తుల పెదతాత పెద్దవిగ్రహాన్ని ఏర్పాటు చేసి గతంలో ఉన్న విగ్రహాన్ని తీసి భద్రపరిచామన్నారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ దాచిన విగ్రహాన్ని బయటకు ఎవరో తీశారని అది గెస్ట్ హౌస్‌కు కాపలా ఉండాల్సిన సెక్యూరిటీ గార్డును సస్పెండ్ చేశామన్నారు. విగ్రహానికి సంబంధించిన విషయంపై గన్నాబత్తుల శ్రీనివాస్‌కు చెప్పడంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా తెలపాలని ఆయనకు సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి : ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు, జనవరి 24: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని, భావిభారత పౌరుల్లా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు సూచించారు. గంధం నరశింహమూర్తి-జేబీ సరోజని స్వచ్ఛంద సేవాసంస్థ అధినేతలు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, ఆలీషా ఆర్థిక సహకారంతో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 234 మంది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు బుధవారం అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, టీడీపీ ఫ్లోర్ లీడర్ బొల్లా వీరశ్వేత, కౌన్సిలర్లు కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మహిళా మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, జిల్లా అధికార ప్రతినిధి బొర్రా సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మల్, పాఠశాల హెచ్ఎం ముత్యాల వెంకటస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులు కోడింగ్‌లో శిక్షణ పొందాలి

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 24 : ఇంజనీరింగ్‌లో ఏ గ్రూపు విద్యార్థి అయిన కోడింగ్‌లో మంచి ప్రావీణ్యత సంపాదిస్తేనే సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ అన్నారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఐసీవీఎంసీవోడీఈఆర్‌జెడ్-2కె23 పేరిట నిర్వహిస్తున్న కోడింగ్ కాంపిటీషన్స్‌కు సంబంధించి పోస్టరును విడుదల చేశారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ డాక్టర్ కేఆర్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కోడింగ్ క్లబ్ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డేవిడ్‌రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా నున్నా ఆనంద్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24: తాడేపల్లిగూడెం వాసవి క్లబ్ అధ్యక్షుడిగా నున్నా ఆనంద్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆడిటోరియం వద్ద ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బోడా సాయి సూర్యప్రకాష్, జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి క్లబ్ కార్యదర్శిగా సీహెచ్‌వీఆర్ గుప్తా, కోశాధికారిగా కర్నాటి రంగారావు, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా పొన్నగంటి స్వర్ణకాంతి, కార్యదర్శిగా కొనకళ్ల ప్రభ, కోశాధికారిగా నూలు ఫణి ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు మండవల్లి నాగేంద్ర, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్

నరసాపురం రూరల్; జనవరి 24: కౌలు రైతులకు రుణాలందించేందుకు బ్యాంకర్లు శ్రద్ధ చూపాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు రైతులకు ఇచ్చిన రుణాలు, తీసుకున్న రుణాలపై ఆరా తీశారు. అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులు రైతులకు అందించే స్కీమ్‌పై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కౌలు రైతులుకు రుణాలు, పశువులు, గొర్రెలు, మేకలకు రుణాల కోసం దరఖాస్తు చేసుకుని వాటిని మంజూరు చేయడం, సబ్సిడీ రుణాలు, రికవరీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. బ్యాంకు అధికారి పీఎం నర్సింహారావు, ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఆచంట, జనవరి 24:వల్లూరు, కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం హైస్కూళ్లకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వల్లూరు హైస్కూల్లో ట్యాబ్‌లు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచ్‌లు సీతారామ్, బోడపాటి బుల్లియ్య ముచ్చర్ల నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఏడిద రామలక్ష్మి, మొల్లేటి రామకృష్ణ, ఎంఈవో పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నాయకులకు నోటీసులు

ఆకివీడు, జనవరి 24: సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ గురువారం ఛలో విజయవాడకు పిలుపునివ్వడంతో మండల నాయకులకు బుధవారం పోలీసులు నోటీసులు జారీచేశారు. విజయవాడలో నిర్వహించే సమావేశానికి వెళ్లకుండా ముఖ్యనేతలకు నోటీసులు అందించారు.